# మహిళల సామాజిక ఆర్థిక అభివృద్ధిలో మహిళా సంఘాల కృషి గొప్పది

**మహిళా సమైక్య సంఘాల సాధికారతకు పూర్తి సహకారాన్ని అందిస్తూ, మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తాం**

**సిరిసిల్లలో ఇందిరమ్మ చీరల పంపిణీలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ**



**ప్రజానావ, సిరిసిల్ల :** మహిళా పొదుపు సంఘాల సభ్యులకు మహిళా శక్తి ఇందిరమ్మ చీరల పంపిణీ సిరిసిల్ల మున్సిపాలిటీలో మంగళవారం ప్రారంభించారు. ఇప్పటికే ఇందిరమ్మ చీరలు గ్రామీణ ప్రాంతాల మహిళలకు పంపిణీ జరిపారు. బతుకమ్మ చీరలు స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా శక్తి పథకం పేరుతో మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గత స్థానిక సంస్థల ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాలలో మహిళా పొదుపు సమైక్య సంఘాల సభ్యులకు ఈ చీరల పంపిణీ పూర్తి చేశారు. అయితే అవసరమైన మేరకు కొత్త పథకంలో నూతన రకాలతో చీరలు ఉత్పత్తి కాకపోవడంతో మున్సిపాలిటీలలో తాజాగా ఇందిరమ్మ చీరలు పంపిణీ ప్రారంభించారు. కాగా మంగళవారం స్థానిక 3వ వార్డులో మహిళ సమైక్య సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా సిరిసిల్లలో మహిళా సమైక్య సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను మంగళవారం రోజు నుండి అన్ని వార్డులలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళల సామాజిక ఆర్థిక అభివృద్ధిలో మహిళా సమైక్య సంఘాల కృషి చాలా గొప్పదని అన్నారు. మహిళా సమైక్య సంఘాల సాధికారతకు పురపాలక సంఘం ద్వారా మా పూర్తి సహకారాన్ని అందిస్తూ మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్పీలు, మహిళా సమైక్య సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

# శిథిలమవుతున్న ఎగువ మానేరు ప్రాజెక్టును కాపాడాలి

- కొట్టుకపోయి ప్రాజెక్టు పునాదులకు ముప్పు తెస్తున్న అప్రాన్ నిర్మాణం వెంటనే చేపట్టాలి
- కాలువలు ఆధునీకరణ, శిథిలమైన గొలుసుకట్టు కాలువలను పునరుద్ధరించాలి
- సగం పూడికతో నిండిన ప్రాజెక్టులో నీటి సామర్థ్యం నిలువ పెంచాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**ప్రజానావ, సిరిసిల్ల :** దశాబ్దాల చరిత్ర గల ఎగువ మానేరు (నర్మాల) ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకున్నదని, దీనిపై ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక దృష్టి సారించి ప్రాజెక్టును కాపాడి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ పార్టీ వ్యవసాయ సంఘం నాయకులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. చరిత్రాత్మకమైన ఎగువ మానేరు ప్రాజెక్టు పై సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్నదని, దీనివల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నదన్నారు. గతంలో భారీ వరదలకు ప్రాజెక్టు కింది భాగంలో ఉన్న ఆప్రాన్ పూర్తిగా కొట్టుకపోయిందని దీనివల్ల ప్రాజెక్టు పునాదులకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆప్రా నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నుండి నీటి విడుదల సమయంలో ప్రవాహ ఉధృతిని తగ్గించడానికి అవసరమైన నీటి తొట్లను శాస్త్రీయంగా నిర్మించాలని కోరారు. వెంటనే పూడికతీత పనులను చేపట్టి ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలన్నారు. 2.2 టీఎంసీల సామర్థ్యం గల ఎగువ మానేరు ప్రాజెక్టు మట్టి, ఇసుక కొట్టుకు రావడంతో ప్రాజెక్టులో సగం మేరకు పూడికతో నిండిపోయిందని తెలిపారు. దీనివల్ల కేవలం ఒక టీఎంసీ నీటి నిలువకు మాత్రమే అవకాశం ఉన్నదని గుంటి వేణు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు పాల్గొన్నారు.

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలే కవచం

**అహ్మదీపూర్‌లో 'మన పోలీస్-మన ఊరు' కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్ పిలుపు**




**ప్రజానావ, గజ్వేల్ :** గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా భద్రత మరింత బలోపేతం అవుతుందని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్ పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ గ్రామంలో నిర్వహించిన "మన పోలీస్–మన ఊరు" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం, మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడిన కమిషనర్, గ్రామానికి కొత్తగా వచ్చే వ్యక్తుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. అపరిచితుల ద్వారా ఎక్కువగా నేరాలు జరిగే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా సీసీ కెమెరాలు నిరోధకంగా పనిచేస్తాయని, "ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానం" అని వ్యాఖ్యానించారు. గ్రామాల్లో యువకులు మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కుటుంబాల్లో తలెత్తే చిన్నపాటి వివాదాలను పోలీస్ స్టేషన్ వరకు తీసుకెళ్లకుండా గ్రామ కమిటీల ద్వారానే పరిష్కరించుకోవడం మంచిదని అన్నారు. ఇంటర్నెట్‌ను విజ్ఞానానికి వినియోగించుకోవాలని, చెడు అలవాట్లు మరియు తప్పుదోవలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాస్ శ్రీనివాస్ , గజ్వేల్ ఏసీపీ నర్సింలు, సీఐలు రవికుమార్, ముత్యం రాజు, బిజెపి రాష్ట్ర నాయకులు ఆకుల రాజయ్య, ట్రాఫిక్ పోలీసులు, గ్రామ సర్పంచ్ ప్రభాకర్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# వేతనాలు పెంచకపోతే ఉద్యమమే బిఎంఎస్



- కార్మికులకు రూ.25 వేల కనీస వేతనం కల్పించాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బిఎంఎస్ నాయకులు
- వేతనాలు సవరించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక

**ప్రజానావ, గజ్వేల్ :** రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్మికుడికి కనీసం రూ.25 వేల వేతనం కల్పించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సల్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రూ.16 వేల కనీస వేతనం కార్మిక కుటుంబాల జీవనానికి ఏమాత్రం సరిపోదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేటలోని బిఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలను సకాలంలో సవరించకుండా అప్పటి ప్రభుత్వాలు కార్మికులకు అన్యాయం చేశాయని ఆరోపించారు. యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరించడం వల్లే కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వాలు ప్రతి ఐదేళ్లకోసారి వేతనాలను సవరించి ఉంటే ప్రస్తుతం కనీస వేతనం రూ.25 వేల దాటేదని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన కనీస వేతనాల కంటే రాష్ట్ర ప్రభుత్వం తక్కువ మొత్తాన్ని ఖరారు చేయడం సరికాదన్నారు. కార్మికుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వకుండా కేవలం పేరుకు మాత్రమే వేతనాల పెంపు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని కనీస వేతనాలను పునఃసమీక్షించాలని కోరారు. లేకపోతే బిఎంఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా మల్కగల్ల కరుణాకర్

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా**



**ప్రజానావ, గజ్వేల్ :** ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా మల్కగల్ల కరుణాకర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. జాతీయ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్, తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం సమక్షంలో ఈ నియామక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మల్కగల్ల కరుణాకర్ మాట్లాడుతూ తనకు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎస్సీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లేలా పని చేస్తానని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ యువతకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన జాతీయ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్, తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి మల్కగల్ల కరుణాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిష్టాపూర్‌లో అయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు




**ప్రజానావ, నారాయణపేట:** నారాయణ పేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు పంటపై అవగాహన కల్పించడం జరిగింది. ఆయిల్ పామ్ సాగు, సాగు పద్ధతులు, ఆయిల్ పామ్ లో ప్రభుత్వ సబ్సిడీ వివరాలు ఆయిల్ పామ్ లో డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఆయిల్ పామ్ సాగు వలన లాభాలు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ కొండయ్య, ఉపసర్పంచ్ ఆంజనేయులు, హార్టికల్చర్ ఆఫీసర్ నారాయణపేట సమీనా, ధన్వాడ మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, ఏఈ వో జైన్ సింగ్, హెఈ ఓ లింగరాజు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఈశ్వర్, రైతులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# పంట అవశేషాల దహనాన్ని అరికట్టాలి

**వెల్గటూర్, ఎండపల్లి రైతులకు ఎస్సై సూచనలు**

**ప్రజానావ, ఎండపల్లి:** పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా అరికట్టి పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలని వెల్గటూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై పి.ఉదయ్ కుమార్ సూచించారు. పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలు, మొక్కజొన్న అవశేషాలను కాల్చివేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెల్గటూర్, ఎండపల్లి మండలాల రైతులకు ఆయన అవగాహన కల్పించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు రహదారులపై పొగమంచు ఏర్పడి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. భూమిలోని సూక్ష్మ జీవులు నశించి నేల సారవంతత తగ్గిపోవడంతో పాటు వ్యవసాయ దిగుబడులపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. అలాగే అగ్నిప్రమాదాల కారణంగా సమీపంలోని డ్రిప్ పైపులు, విద్యుత్ మోటార్లు, ఇతర వ్యవసాయ పరికరాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి సారాన్ని కాపాడేందుకు రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. పంట అవశేషాలను భూమిలోనే కలపడం, పశుగ్రాసంగా లేదా సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించడం వంటి మార్గాలను అవలంబించాలని తెలిపారు. ఎవరైనా వరి కొయ్యలు లేదా ఇతర పంట అవశేషాలను కాల్చినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు కూడా విధించబడతాయని ఎస్సై స్పష్టం చేశారు.

